## పకడ్బందీగా ధాన్యం సేకరణ

**కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**



పాల్గొన్న అధికారులు

కామారెడ్డి, అక్టోబర్ 17 : వానకాలంలో రైతులు పండించిన ధాన్యాన్ని జిల్లా పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో కొనుగోలు చేసేందుకు ఈ నెల చివరి వారంలో జిల్లాలో 347 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ తెలిపారు. జిల్లాలో ఈ వానాకాలంలో రైతులు 2,92,105 ఎకరాల్లో వరిని పండించగా విపణిలోకి 6.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశముందన్నారు. అందుకనుగుణంగా పీఏసీఎస్ ఆధ్వర్యంలో 325, ఐకేపీ ఆధ్వర్యంలో 22 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వానాకాలం 2023-24 ధాన్యం కొనుగోళ్లపై అధికారులు, రైస్ మిల్లర్లు తదితరులతో మంగళవారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. కేంద్రాల్లో అవసరమైన తేమను కొలిచే యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, కాంటాలు, టార్పాలిన్లను సిద్ధం చేయాలని సూచించారు. గన్నీ సంచుల కొరత రాకుండా ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలన్నారు. ఏ గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2,203, ముతక రకానికి రూ.2,183 మద్దతు ధర చెల్లించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ అభిషేక్ సింగ్, జల సహకార అధికారి సంపాచలం, వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, మార్కెటింగ్ అధికారి రమ్య, జిల్లా రవాణాధికారి వాణి, రైస్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు లింగం, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు, వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

**కౌంటింగ్ కేంద్రాల్లో ఫర్నిచర్ ఇతర వసతులు కల్పించాలి**

కామారెడ్డి పట్టణంలోని ఎస్పీ ఆఫీస్ సమీపంలో ఉన్న కౌంటింగ్ కేంద్రంలో ఫర్నిచర్ ఇతర వసతులను కల్పించాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అధికారులకు సూచించారు. మంగళవారం కౌంటింగ్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. వచ్చే సాధారణ ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించడానికి పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా ఎన్నికల విభాగం అధికారి ప్రేమ్ కుమార్, అధికారులు ఇంద్ర ప్రియదర్శిని, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# తారక 'మంత్రం'

- నేడు కామారెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- ముఖ్య కార్యకర్తలతో అంతర్గత సమావేశం
- దిశా నిర్దేశనం చేయనున్న మంత్రి కేటీఆర్
- కేసీఆర్‌కు భారీ మెజార్టీ లక్ష్యంగా వ్యూహ రచన
- ముఖ్యమంత్రికి ఇప్పటికే ప్రజల స్వచ్ఛంద మద్దతు
- నవంబర్ 9న సభ ఏర్పాట్లపైనా సమీక్షించే అవకాశం

నిజామాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) కామారెడ్డి నియోజకవర్గం నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేస్తుండడంతో అంతటా ఒకటే చర్చ జరుగుతున్నది. ఈ ప్రాంతం నుంచి గులాబీ అధినేత నామినేషన్ దాఖలు చేస్తుండగా, ప్రజల్లో ఉత్సాహం కనిపిస్తున్నది. రెట్టించిన ఆనందంతో సీఎం కేసీఆర్‌ను గెలిపించుకోవాలనే బలమైన ఆకాంక్షను నియోజకవర్గ ప్రజలు కనబరుస్తున్నారు. ఈ నేపథ్యంలోనే భారీ మెజార్టీయే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ పావులు కదుపుతున్నది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను తుత్తునియలు చేసేందుకు వ్యూహాలకు పదును పెడుతున్నది. తెలంగాణ తెచ్చిన పార్టీగా, ఉద్యమ నాయకుడిగా కేసీఆరే స్వయంగా కామారెడ్డికి వస్తుండడంతో భవిష్యత్తులో ఈ ప్రాంతానికి చేకూరే మేలును బీఆర్ఎస్ నేతలంతా వివరిస్తున్నారు. మరోవైపు గులాబీ దళపతి రాకతో కామారెడ్డి నియోజకవర్గం మోడల్‌గా నిలుస్తుందని ప్రజలు ఆనంద పడుతున్నారు. ఇందుకు అనుగుణంగానే అధికార పార్టీ కార్యాచరణను సిద్ధం చేసింది. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సారథ్యంలో పక్కాగా ప్రణాళికలు రూపొందుతున్నాయి. ఎన్నికల క్యాంపెయిన్ ఇన్‌చార్జీగా కేటీఆర్ సైతం రంగంలోకి దిగుతున్నారు. వీరికి తోడుగా ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి సైతం దీనిని విజయవంతం చేసే పనిలో నిమగ్నం అయ్యారు.

**టార్గెట్ భారీ మెజారిటీ..**

సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న నియోజకవర్గం కావడంతో రాష్ట్రంలో కామారెడ్డికి ప్రాధాన్యత ఏర్పడింది. కేసీఆర్ బరిలో నిలుస్తుండడంతో అందరి దృష్టి ఇటువైపే కేంద్రీకృతమైంది. ఈ నేపథ్యంలో కేటీఆర్ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకున్నది. అక్టోబర్ 7న కామారెడ్డి పర్యటనకు వచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ ప్రాంత నాయకులకు దిశా నిర్దేశనం చేశారు. దాదాపు గంటకుపైగా కేటీఆర్ నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో భారీ మెజారిటీయే లక్ష్యంగా గులాబీ సైన్యం పనిచేయాలని సూచించారు. కేసీఆర్ రాకతో కామారెడ్డిలో గెలుపు ఖాయమైన నేపథ్యంలో మెజారిటీపైనే ఫోకస్ చేయాలని చెప్పారు. సరిగ్గా పది రోజుల్లోనే మరోమారు కేటీఆర్ బీఆర్ఎస్ నాయకులతో నేడు (బుధవారం) సమీక్ష నిర్వహించనుండగా, ప్రాధాన్యతను సంతరించుకున్నది. కేటీఆర్ మార్గదర్శకాల మేరకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సారథ్యంలో నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయి. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్ సైతం గంప గోవర్ధన్‌తో కలిసి ప్రతిపక్షాల అవకాశాలను కొల్లగొడుతున్నారు. నియోజకవర్గంలో అన్ని సామాజికవర్గాల వారితో నిరంతరం సమావేశాలు నిర్వహించడంతోపాటు సంక్షేమ కార్యక్రమాల ద్వారా లబ్ధిపొందిన వారి ఇంటింటికీ వెళ్లి కలిసే ప్రయత్నం చేస్తున్నారు. కేసీఆర్ పాలనలో సాధించిన ప్రగతిని వివరించేలా గులాబీ శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు.

**నవంబర్ 9న నామినేషన్, కేసీఆర్ సభ..**

కామారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్ వచ్చే నెల 9న నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇప్పటికే కేసీఆర్‌కు సంబంధించిన బీ-ఫామ్‌ను ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అందుకున్నారు. కేసీఆర్ ఆదేశాలతో ఒక సెట్ నామినేషన్‌ను ముందస్తుగానే సమర్పించే అవకాశాలు ఉన్నాయి. అనంతరం సీఎం కేసీఆర్ స్వయంగా తన నామినేషన్‌ను నవంబర్ 9న మరోసారి రిటర్నింగ్ అధికారికి సమర్పించనున్నారు. కామారెడ్డి నుంచి కేసీఆర్ పోటీకి సై అన్న తర్వాత తొలిసారి నియోజకవర్గానికి వస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేస్తున్నాయి. కామారెడ్డి పట్టణంలో కేసీఆర్ సభ, ప్రచార కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు నాయకులు సిద్ధమవుతున్నారు. నవంబర్ 9న గజ్వేల్‌లో నామినేషన్ సమర్పించిన అనంతరం కేసీఆర్ నేరుగా కామారెడ్డికి వస్తారు. ఇక్కడ నామినేషన్ సమర్పించి సభలో ప్రసంగిస్తారు. కామారెడ్డి నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కేసీఆర్ ప్రసంగం ఉండబోతున్నది. పదేండ్ల కేసీఆర్ పాలనతో కామారెడ్డి పట్టణలో రెట్టింపు అభివృద్ధి జరిగింది. సీఎం కేసీఆర్ రాకతో ఊహించని అభివృద్ధి జరగడం ఖాయంగా కనిపిస్తోంది. బుధవారం కేటీఆర్ కరీంనగర్‌లో పలు కార్యక్రమాలను ముగించుకొని మధ్యాహ్నం ఒంటి గంటకు కామారెడ్డికి హెలికాప్టర్‌లో చేరుకుంటారు. అనంతరం కార్యకర్తలతో మండలాల వారీగా భేటీ అవుతారు. సాయంత్రం 5గంటలకు హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు. దాదాపు నాలుగున్నర గంటల పాటు కేటీఆర్ టూర్ ఉండనున్నది.

## చెరుకు ధర క్వింటాలుకు రూ.400 పెంచాలి




సమావేశంలో పాల్గొన్న ఇందూరు జిల్లావాసి కొండెల సాయిరెడ్డి

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 17 : దేశంలో చెరుకు ధరను క్వింటాలుకు కనీసం రూ.400 పెంచాలని, రికవరీ రేటును 9 శాతంగా ఉంచాలని అఖిల భారత చెరుకు జాతీయ కార్యదర్శి కొండెల సాయిరెడ్డి భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కమిషనర్ ఫర్ అగ్రికల్చరల్ కాస్ట్స్ అండ్ ప్రైసెస్(వ్యవసాయ ధరల నిర్ణాయక సంఘం) చైర్మన్ విజయపాల్‌శర్మకు వినతిపత్రం సమర్పించారు. విజయ్‌పాల్ శర్మ అధ్యక్షతన ఢిల్లీలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి నిజామాబాద్ జిల్లా నుంచి అఖిల భారత రైతు చెరుకు అయం జాతీయ కార్యదర్శి కొండెల సాయిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చెరుకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో ప్రస్తావించారు. చెరుకు నుంచి ఇథనాల్, బయో ఎరువులు, గ్యాస్, విద్యుత్, చక్కెర తదితర ఉత్పత్తులు వస్తున్నాయని తెలిపారు. 2014లో చెరుకు ధరలు 9శాతం రికవరీ కన్నా ఎక్కువగా ప్రకటించబడ్డాయని, ఈ నేపథ్యంలో రికవరీ రేటును 9 శాతంగా ఉంచాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. చెరుకు సరఫరా చేసిన రైతులకు 14 రోజుల్లోగా డబ్బులు చెల్లించాల్సి ఉండగా, ఇందుకు భిన్నంగా చక్కెర ఫ్యాక్టరీలు సకాలంలో చెల్లింపులు చేయడంలేదని సమావేశం దృష్టికి తీసుకవచ్చారు. ఉత్తరప్రదేశ్‌లోని ఓ కర్మాగారం ఆరు నెలల నుంచి ఏడాది వరకు చెల్లింపులు చేయడం లేదని గుర్తుచేశారు. సకాలంలో డబ్బులు చెల్లించకపోతే క్రిమినల్ కేసులు పెట్టేలా రైతులు యజమానులకు మధ్య ఒప్పందం జరిగేలా చూడాలని సాయిరెడ్డి కోరారు.

## ప్రయాణికులకు బహుమతులు, రిటర్న్ టికెట్‌పై 10శాతం రాయితీ

ఖలీల్‌వాడి, అక్టోబర్ 17 : ఉమ్మడి జిల్లా ప్రయాణికులకు బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ఆర్టీసీ ఆధ్వర్యంలో బహుమతులను గెలుచుకునే అవకాశాన్ని కల్పించినట్లు ఆర్ఎం జానీరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి 30వ తేదీవరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారు టికెట్ వెనుక ఆధార్ కార్డులోని పూర్తి పేరు, ఫోన్ నంబర్ రాసి బస్టాండ్‌లోని గిఫ్ట్ బాక్స్‌లో వేయాలన్నారు. లక్కీ డ్రా ద్వారా ఐదుగురు మహిళలు, పురుషులకు రూ. 9900 చొప్పున బహుమతులను అందజేస్తామని తెలిపారు. అలాగే ఈ నెల 20 నుంచి 30 మధ్య తిరుగు ప్రయాణం టికెట్లను సైతం ముందుగా బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ముందస్తు www.tsrtconline.in వెబ్‌సైట్‌లో రిజర్వేషన్ చేసుకోవాలని సూచించారు.

## భారీగా బంగారం, వెండి ఆభరణాల పట్టివేత

- ముమ్మరంగా వాహనాల తనిఖీ
- కమ్మర్‌పల్లిలో 45.9 తులాల బంగారం.. 17 కిలోల వెండి స్వాధీనం
- ఎల్లారెడ్డిలో రూ.ఐదు లక్షలు, సలాబత్‌పూర్ వద్ద రూ.2.70 లక్షలు, పాతంగల్ చెక్‌పోస్టు వద్ద రూ.లక్షా 39 వేల నగదు పట్టివేత

కమ్మర్‌పల్లి/నిజామాబాద్ క్రైం/ఎల్లారెడ్డి/మద్నూర్/కోటగిరి/భిక్కనూరు, అక్టోబర్ 17: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. కమ్మర్‌పల్లిలో వాహనాల తనిఖీ నిర్వహించగా.. 45.9 తులాల బంగారు ఆభరణాలు, 17 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు భీమ్‌గల్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం సాయంత్రం కమ్మర్‌పల్లి ఎస్సై రాజశేఖర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. కమ్మర్‌పల్లిలోని అంతర్ జిల్లా చెక్ పోస్టు వద్ద ఎస్సై రాజశేఖర్ వాహనాల తనిఖీ చేపట్టారు. మెట్‌పల్లి వైపు నుంచి కారులో ఇద్దరు వస్తుండగా తనిఖీ చేయగా.. వారి వద్ద సరైన పత్రాలు లేకుండా 45.9 తులాల బంగారు, 17 కిలోల వెండి ఆభరణాలు లభ్యమైనట్లు ఎస్సై తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకొని జిల్లా ట్రెజరీకి అప్పగించినట్లు చెప్పారు. మొత్తం ఆభరణాల విలువ సుమారు రూ.40 లక్షల 50 వేలు ఉంటుందని వివరించారు.

**నిజామాబాద్‌లో రూ.19 లక్షలు సీజ్**

నిజామాబాద్‌లోని పూలాంగ్ చౌరస్తా వద్ద నగర సీఐ నరహరి, నాల్గో టౌన్ ఎస్సై సంజీవ్, టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు తనిఖీలు నిర్వహించారు. ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న రూ.19 లక్షల నగదు పట్టుకున్నారు. డబ్బులకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి ఐటీ శాఖ అధికారులకు అప్పగించినట్లు సీఐ నరహరి తెలిపారు.

**బెల్ట్ షాపులపై దాడులు**

నిజామాబాద్‌నగరంలోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హమాల్‌వాడి దర్గా వద్ద మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. రూ.15వేల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యం విక్రయిస్తున్న శంకర్‌ను అరెస్టు చేశామని ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఆరో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అర్సపల్లి, సారంగపూర్ డెయిరీ ఫారం ఏరియాలో అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తుండగా ఎస్సై రవీందర్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో 6.6 లీటర్ల లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఓ మహిళతోపాటు మరో నిర్వాహకుడిపై కేసులు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. ఎల్లారెడ్డి పట్టణ శివారులో తనిఖీలు చేస్తుండగా ఐదు లక్షల రూపాయలు లభించడంతో సీజ్ చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. తనిఖీల్లో ఎస్సై గణేశ్, సిబ్బంది పాల్గొన్నారు. మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్ చెక్‌వద్ద మహారాష్ట్ర నుంచి వస్తున్న రెండు కార్లను తనిఖీ చేసి 2.70లక్షల రూపాయలను పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న డబ్బులను ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులకు అప్పగించారు. కోటగిరి మండలంలోని పొతంగల్ మంజీరా నది ప్రాంతంలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద మద్నూర్ నుంచి వస్తున్న ఓ వ్యక్తి వద్ద రూ.లక్షా 39 వేలు ఉన్నట్లు గుర్తించారు. డబ్బులకు సంబంధించి ఎలాంటి రసీదు లేకపోవడంతో స్వాధీనం చేసుకొని ఎన్నికల అధికారులకు అప్పగిస్తామని కోటగిరి ఎస్సై సందీప్ తెలిపారు. భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తా వద్ద కామారెడ్డి నుంచి సిద్దిపేట జిల్లా దుబ్బాకకు వెళ్తున్న రాములు అనే వ్యక్తి వాహనాన్ని తనిఖీ చేయగా.. ఎలాంటి పత్రాలు లేకుండా ఉన్న రూ.2 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★ రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.

NT-320501

WANTED

★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం, జీతం-16k to 18k ఏజెంట్ కమిషన్ 6k, Ph: 9640468899, 9640258899.

NT-320252




WANTED

★ LAB TECHNICIANS/ NIGHT DUTY LAB TECHNICIANS, Contact No.98481 75581, 93466 05125

NTZ-308993

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.